క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



వంట పాత్రలను పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

ఎన్పీకుంట: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. స్థానిక విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మండలంలోని 57 పాఠశాలల్లోని మిడ్ డే మీల్స్ నిర్వాహకులకు సుమారు రూ.5 లక్షల విలువచేసే వంట పాత్రలను పంపిణీ చేశారు.

నేటి నుంచి 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ

బత్తలపల్లి: ప్రతి నెలా వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళలకు అందజేస్తున్న సామాజిక పింఛన్ల సొమ్మును బుధవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 6,414 మందికి వివిధ రకాల పింఛన్లు అందుతున్నట్లు తెలిపారు. వీటికి రూ.1,77,69,250 విడుదలైనట్లు తెలిపారు. బయోమెట్రిక్ పడని వారి ఫొటో తీసుకుని మరుసటి రోజు వలంటీర్లు లబ్ధిదారుని ఇంటి వద్దకు వచ్చి పింఛన్ మొత్తం అందజేయనున్నట్లు తెలిపారు.

నియామక పత్రం అందజేత



వలంటీర్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎంపీపీ రమణారెడ్డి

నల్లచెరువు: మండలంలోని సచివాలయం-2 క్లస్టర్లకు సంబంధించి నూతనంగా ఎంపికైన గ్రామ వార్డు వలంటీర్ రాఘవకు ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీఓ శకుంతల మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. కన్వీనర్ హైదర్‌వలి, డైరెక్టర్ ఆదిమూర్తి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

రామాపురం విద్యార్థినికి అభినందనలు



విద్యార్థిని అనితతో నాయకులు, ఉపాధ్యాయులు

బత్తలపల్లి: నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఈనెల 4నుంచి జరిగే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలవిద్యార్థిని అనిత ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం వెంకటరాముడు తెలిపారు. సదరు విద్యార్థినిని వైఎస్సార్‌సీపీ నాయకులు బండి వీరనారప్ప, పెదయ్య, పద్మావతి, ఉపాధ్యాయులు మంగళవారం సన్మానించారు.

4న మండల సమావేశం

గాండ్లపెంట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమానాయక్ మంగళవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

దంపెట్లలో పంటకోత ప్రయోగాలు



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

బత్తలపల్లి: దంపెట్ల గ్రామంలో సర్వే నెంబర్ 332-1 రైతు రామాంజనేయులు వర్షాధారం కింద సాగు చేసిన వేరుశనగ పంటలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. 5 x 5 మీటర్ల విస్తీర్ణంలో 650 గ్రాములు దిగుబడి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. మండల వ్యసాయాధికారి ఓబిరెడ్డి, మండల గణాంక అధికారి డాక్టర్ కేఎల్ లక్ష్మీనరసింహశర్మ, ఎంపీఈఓ సోమశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

బత్తలపల్లి: మండల కేంద్రంలోని హమాలీ యూనియన్ కార్యాలయంలో 104వ ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, రైతు సంఘం జిల్లా నేత కమతం కాటమయ్య, బండల వెంకటేష్, శివ పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం ఆదర్శప్రాయం



ఎన్పీకుంట: ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, అధికారులు



ఓడీ చెరువులో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



కొక్కంటిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

దేశ తొలి ఉప ప్రధాని, విశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం దేశ సమైక్యత కోసం ప్రతిజ్ఞ చేశారు.

ఎన్పీకుంట: సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ ఈటి రాము, ఎంపీడీఓ ఆదినారాయణ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ ఐక్యతకు వల్లభాయ్ పటేల్ ఎంతో కృషిచేశారని అన్నారు. అవినీతి రహిత సమాజం ఏర్పడినప్పుడే దేశం ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. అనంతరం దేశ సమైక్యత కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈఓ పీఆర్డీ మనోహర్, ఏపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నల్లచెరువు: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీఓ శకుంతల ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ యువత సర్దార్ వల్లభాయ్ పటేల్ అడుగు జాడల్లో నడవాలని ఆకాంక్షించారు. కన్వీనర్ హైదర్‌వలి, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, డైరెక్టర్ ఆదిమూర్తి పాల్గొన్నారు.

తనకల్లు: కొక్కంటిలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఎంపీడీఓ పూల నరసింహులు పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రజలతో, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి ఎంపీడీఓ అంజనప్ప నివాళులర్పించారు.

ధర్మవరం అర్బన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ అడుగు జాడల్లో నడవాలని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ సూచించారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలో మంగళవారం రన్ ఫర్ యూనిటీ ర్యాలీని నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు డీఎస్పీ బహుమతులు అందించారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.



ధర్మవరంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఓడీచెరువు: ఎంపీడీఓ కార్యాలయంలో పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉద్యోగులతో ఎంపీడీఓ వరలక్ష్మి ప్రతిజ్ఞ చేయించారు. జెడ్పీటీసీ కుర్లి దామోదర రెడ్డి, ఎంపీపీ పర్వీన్ భాను, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్ బాషా, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, గొల్లపల్లి వెంకట రెడ్డి పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయండి

నల్లమాడ: మండల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో జరిగిన మండల సమావేశంలో ఎంపీపీతోపాటు జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ కే. సూర్యనారాయణ మాట్లాడారు. మండలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తిస్తూ పథకాలు సక్రమంగా అమలు చేయాలన్నారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పక్కాగృహాలకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని, సిమెంట్, ఇసుక కొరత లేకుండా చూడాలని కోరారు. మసకవంకపల్లిలో పేద రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎస్.రాంమోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీఓ కొండన్న, సర్పంచ్‌లు బొజ్జేనాయక్, ప్రసాద్, ఆనంద్‌నాయక్, లింగమూర్తి, మండల కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రసూల్, ఎంపీటీసీలు, మండల వైద్యాధికారి డాక్టర్ గణేనాయక్, ఎంఈఓ వేమనారాయణ, హౌసింగ్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, చిన్న నీటి పారుదల శాఖల ఇంజినీర్లు సుమన్‌నాయక్, గురురాజు గుప్త, శశికళ, అనీల, ఏపీఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

జగనన్నతో పేదలకు సొంతింటి కల సాకారం



ఇంటి పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

• ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: సీఎం జగనన్నతో పేదలకు సొంతింటి కల సాకారమవుతోందని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గంగన్నగారిపల్లి జగనన్న కాలనీలో మంగళవారం ఆయన 64 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి పేదకూ సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలులో భాగంగా జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికే కదిరి నియోజకవర్గవ్యాప్తంగా 5 వేలకు పైగా ఇంటి పట్టాలను మంజూరు చేశామన్నారు. ఎంతో విలువైన స్థలాలను నేడు పేదలకు ఇంటి పట్టాలుగా ఇస్తున్నామన్నారు. అంతకుముందు సర్దార్ వల్లభాయ్ పటేల్‌జయంతిని పురస్కరించుకుని పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్, వైస్‌ఎంపీపీ ఆదినారాయణ, ఎంపీటీసీ పుల్లయ్య, కో ఆప్షన్ సభ్యుడు అల్లాబకష్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పద్మజ, వీఆర్‌ఓ ఇనాయతుల్లా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

కదిరి టౌన్: వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీషా సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ పాల్గొని మాట్లాడారు. సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలన్నారు. 26వ వార్డు కౌన్సిలర్ ఎంఎస్ ఫయాజ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు మొదటి విడతలో 2380 మందికి పట్టాలు మంజూరు చేశారన్నారు. రెండవ విడతలో కుటాగుళ్ల వద్ద 2వేల మందికి ఇంటి పట్టాల కోసం స్థలం కేటాయించారన్నారు. ఆ స్థలాన్ని చదును చేయించడంలో టౌన్‌ప్లానింగ్ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. వెంటనే చదును చేయించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, వైస్ చైర్మన్లు రాజశేఖర్‌రెడ్డి, గంగాదేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నడత మారకపోతే కఠిన చర్యలు

కదిరి టౌన్: నేర ప్రవృత్తిని వీడకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లకు పట్టణ సీఐ నారాయణరెడ్డి హెచ్చరించారు. కదిరి టౌన్‌కు చెందిన పాత కేసుల్లో నిందితులుగా ఉన్న 50 మంది రౌడీషీటర్లను మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. నేరాలకు దూరంగా ఉంటూ స్వశక్తిపై ఆధారపడి జీవించాలని, నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

మానవ హక్కులపై అవగాహన

అమడగూరు: మానవహక్కులపై అమడగూరు ఎస్సీ కాలనీలో అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. రాజ్యాంగం ప్రకారం పౌరులకు ఉన్న ఉండాల్సిన హక్కులను తెలియజేశారు. దళితులను అవమాన పర్చినా, చిన్నచూపు చూసినా మానవ హక్కుల సంఘాన్ని సంప్రదించాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా మానవులంతా ఒక్కటేనన్న భావన అందరిలో కలగాలన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నందిని, ఏఎస్ఐ ధనుంజయ, ఆర్ఐ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వివాదాస్పద రస్తా పరిశీలన

తనకల్లు: మండల పరిధిలోని పోమేనాయక్‌తండాలో వివాదాస్పదంగా ఉన్న రస్తాను తహసీల్దార్ శోభ సువర్ణమ్మ మంగళవారం పరిశీలించారు. చాలా సంవత్సరాలుగా పోమేనాయక్‌తండాకు సరైన రోడ్డు లేదని, ప్రస్తుతం గేమేనాయక్‌తండా నుంచి పోమేనాయక్‌తండాకు మట్టిరోడ్డు వేస్తున్నట్లు పలువురు తండావాసులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. అయితే కొందరు వ్యక్తులు రోడ్డు వేస్తున్న స్థలం తమదని చెబుతూ రోడ్డు వేయకుండా అడ్డుపడుతున్నారని తెలిపారు. రోడ్డు ఎంతవరకు వస్తుందో కొలతలు వేయాలన్నారు. రెండు రోజుల్లో సర్వేయర్లతో రోడ్డుకు కొలతలు వేయిస్తామని, అంతవరకు ఎలాంటి గొడవలు చేయకుండా సహకరించాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

నిందితుడి అరెస్ట్

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్త అశోక్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. పట్నం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మన్సూర్ గతనెల 27న పట్టణంలోని బాలికల పాఠశాల సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద ఉండగా టీడీపీ కార్యకర్త అశోక్ కత్తితో దాడి చేశాడు. నిందితుడు మంగళవారం కదిరి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉండగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

5న కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 5న కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు, కార్యదర్శి సుంకు సుకుమార్ తెలిపారు. ఈమేరకు స్వాతి క్లినిక్‌లో మంగళవారం కరపత్రాలు విడుదల చేశారు. రాధాకృష్ణ, శీలా నాగేంద్ర, డాక్టర్ బీవీ సుబ్బారావు, శివప్రసాద్, రమేష్‌బాబు, కోటీశ్వరరావు, ఓవీ ప్రసాద్, బండి నాగేంద్ర పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు

కదిరి అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కదిరి ఆర్టీసీ డిపో డిఎం మైనోద్దీన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు బయోడేటాను అప్రెంటిస్‌షిప్ సైట్‌లో రిజిస్ట్రేషన్ బ్లాగులో నవంబర్ 15వ తేదీలోగా అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్‌లో ఫీడ్ చేసిన జిరాక్స్

సంక్షిప్త సమాచారం

కాపీలతో పాటు నిర్ణీత దరఖాస్తు ఫారంలో వివరాలను నమోదు చేసి నవంబర్ 15వ తేదీలోగా ప్రిన్సిపాల్ జోనల్ శిక్షణా కళాశాల ఏపీఎస్‌ఆర్టీసీ కర్నూల్‌కు పంపాలన్నారు. జిల్లాలో డీజిల్ మెకానిక్ పోస్టులు 32, మోటార్‌మెకానిక్ 3, ఎలక్ట్రీషియన్ 3, వెల్డర్ 1 మొత్తం 40 పోస్టులు ఉన్నాయన్నారు. వివరాలకు 7382869399 సెల్‌నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఆర్డీఓకు సన్మానం

ధర్మవరం: ధర్మవరం నూతన ఆర్డీఓ రమేష్‌రెడ్డిని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పరంధామరెడ్డి, ఉపాధ్యక్షుడు శీనా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. సభ్యులు బెస్త వెంకటరమణ, అంగజాల నరేష్, రమణ, వెంకటరమణస్వామి, సుధాకర్, హరిప్రసాద్, దాసరి రాము, సాకే విజయ్‌కుమార్, నరసింహులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులకు ఘనంగా వీడ్కోలు

తనకల్లు: పీజీ చదివేందుకు వెళ్తున్న కొక్కంటి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శివనారాయణకు వైద్య సిబ్బంది మంగళవారం వీడ్కోలు పలికారు. ఎంపీడీఓ పూల నరసింహులు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసి నాణ్యమైన వైద్య సేవలను అందజేశారని కొనియాడారు. మెడిసిన్‌లో పీజీ సీట్లు రావడం అభినందనీయమన్నారు. అనంతరం వైద్యులను సన్మానించారు. అదేవిధంగా బదిలీపై వెళ్తున్న పలువురు ఏఎన్‌ఎంలను సత్కరించారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండండి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడిమర్రి: పొగాకు ఉత్పత్తులతో అవయవాలు దెబ్బతిని తీవ్ర అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతాయని వైద్యాధికారి కృష్ణప్రసాద్ హెచ్చరించారు. పొగాకుతో జరిగే అనర్థాలపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముందుగా వైద్య సిబ్బందితో కలసి గ్రామంలో ర్యాలీ చేశారు. సీహెచ్ఓ కళావతి, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, సూపర్‌వైజర్ రామ్‌కుమార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళి

తనకల్లు: దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని మంగళవారం కొక్కంటిక్రాస్‌లో నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ తోపు పారేసు, బీసీ సెల్ అధ్యక్షుడు సోమశేఖర్, మైనార్టీ నాయకులు రఫీ, సాధిక్ పాల్గొన్నారు.

దుకాణాలకు ఇంకా అనుమతి ఇవ్వలేదు

నల్లమాడ: దీపావళి పండుగ సందర్భంగా మండలంలో టపాసుల విక్రయానికి ఏడు మంది దరఖాస్తులు అందజేసినట్లు తహసీల్దార్ దేవేంద్రనాయక్ మంగళవారం తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తులు మాత్రమే స్వీకరించామని, ఇంకా అనుమతులు మంజూరు చేయలేదని తహసీల్దార్ పేర్కొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష

కొత్తచెరువు: పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంలాంటిదని మండల ప్రత్యేక అధికారి శివరంగ ప్రసాద్ తెలిపారు. కొత్తచెరువు జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 281 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేసి మరి కొందరికి శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు.

ధర్మవరం అర్బన్: కంటిచూపు తగ్గిన విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నామని డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వి సాల్మాన్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి వైద్యాధికారి ఉరుకుందప్ప కంటి వైద్యపరీక్షలను నిర్వహించారు. కంటి లోపమున్న విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు.



ధర్మవరంలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల కేంద్రంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. కంటి చూపు సరిగా లేని వారికి చికిత్సలు చేసి కంటి అద్దాలను పంపిణీ చేశారు. డాక్టర్లు రాజేంద్ర, లక్ష్మీ, ఎంపీపీ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు

కదిరి టౌన్: ఇజ్రాయిల్, పాలస్తీనా మధ్య జరుగుతున్న యుద్ధం ముగిసి శాంతియుత వాతావరణం నెలకొనాలని కోరుతూ పట్టణంలో ఈద్గా మైదానంలో మంగళవారం ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి పాల్గొని మాట్లాడారు. యుద్ధంతో పాలస్తీనావాసుల జీవితాలు అతలాకుతలమయ్యాయన్నారు. యుద్ధం నుంచి వారికి విముక్తి కలిగి శాంతి నెలకొనాలని అల్లాను ప్రార్థించినట్లు తెలిపారు. ప్రపంచశాంతి కోసం ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని పిలుపునిచ్చారు. మాజీ సమన్వయ కర్త ఎస్‌ఎండీ ఇస్మాయిల్, వాల్మీకి పాఠశాల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జిలాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.



ఈద్గాలో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

పొలిమేర పెద్దమ్మకు పూజలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రం సమీపంలోని పొలిమేర పెద్దమ్మకు మంగళవారం వెండి ఆభరణాలు, పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.



పూజలందుకుంటున్న అమ్మవారు

పోలీసు అమరవీరుల త్యాగాలు వృథా కావు

బత్తలపల్లి: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు సిబ్బంది త్యాగాలు వృథా కావని, వారి సేవలను ఎవరూ మరువలేరని ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి కూడలి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేసి అమర వీరులకు జోహార్లు అర్పించారు. ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బలో మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను జరుపుకున్నారు. ఎస్ఐ వంశీకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ప్రమాదకరంగా రహదారిపై పార్కింగ్

చెన్నేకొత్తపల్లి: మండలంలోని 44వ జాతీయ రహదారిపై పలుచోట్ల వాహనాలు అడ్డంగా రహదారిపై నిలుపుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కోన కణ్వాశ్రమం వద్ద హంద్రీనీవా కాలువ పక్కన వాహనాలు రోడ్డుపై ఆపి డ్రైవర్లు స్నానాలకు వెళ్తున్నారు. వాహన రాకపోకలకు కూడా ఇబ్బందిగా ఉంది. చెన్నేకొత్తపల్లి గ్రామం వద్ద రెండు జంక్షన్లవద్ద కూడా వాహనాలు రోడ్డుపై నిలుపుతుండడంతో తరచూ ప్రమాదాల చోటు చేసుకుంటున్నాయి.

ఆర్థిక సాయం అందజేత



వలంటీర్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ముదిగుబ్బ: జొన్నలకొత్తపల్లి గ్రామానికి చెందిన వలంటీర్ మధుసూదన్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి మంగళవారం రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు ధనుంజయరెడ్డి, నారాయణస్వామి పాల్గొన్నారు. అదేవిధంగా ముదిగుబ్బకు చెందిన నారాయణ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి వెళ్లి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం జాన్సియా

ధర్మవరం అర్బన్: అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఈనెల 3 నుంచి 5వ వరకు జరిగే ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు పట్టణంలోని జీవనజ్యోతి విద్యార్థులు అభిషేక్, షబరీష్‌గౌడ్, శశాంక్ ఎంపికైనట్లు హెచ్‌ఎం జాన్సియా తెలిపారు. మంగళవారం సదరు విద్యార్థులను అభినందించారు.

లబ్ధిదారులకు సిమెంటు పంపిణీ

గాండ్లపెంట: మలమీదపల్లి, తూపల్లి, కురుమామిడి గ్రామాల్లోని జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుంటున్న 13 మందికి హౌసింగ్ ఏఈ చంద్రారెడ్డి మంగళవారం 380 బస్తాల సిమెంటు పంపిణీ చేశారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

వైద్య ఆరోగ్య సిబ్బందికి సన్మానం

నల్లచెరువు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సేవలందించిన వైద్య ఆరోగ్య సిబ్బందిని ఎంపీపీ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హైదర్‌వలీ మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ శకుంతల, వైద్యులు ఐనుద్దీన్‌ఖాన్, నాగార్జునరెడ్డి, అనురాధ, రోజా, సునీత, ఆశ్వర్థరెడ్డి, సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

'వైఎస్సార్ బీమా' తక్షణ సాయం అందజేత



నగదు అందిస్తున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

ఎన్పీకుంట: మండల కేంద్రానికి చెందిన ఎం.సరస్వతమ్మ, జి.వెంకటరమణలు నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాలకు 'వైఎస్సార్ బీమా' పథకం కింద తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున నగదును సర్పంచ్ ఆంజినమ్మ మంగళవారం అందించారు. పంచాయతీ కార్యదర్శి ముబారక్, శ్రీరాములు పాల్గొన్నారు.

15 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

ధర్మవరం అర్బన్: బార్ కౌన్సిల్ మొండి వైఖరిని నిరసిస్తూ ఈనెల 15 వరకు న్యాయవాదులు విధులను బహిష్కరించనున్నట్లు ధర్మవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపీ సుబ్బారావు తెలిపారు. ఈమేరకు మంగళవారం న్యాయవాదులతో సమావేశమై తీర్మానించినట్లు తెలిపారుర. రూ.20 న్యాయవాదుల సంక్షేమ నిధి స్టాంపు అతికించాలని బార్ కౌన్సిల్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. హైకోర్టు సుమోటోగా స్వీకరించి రాష్ట్రంలోని న్యాయవాదులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ

నల్లచెరువు: దేవిరెడ్డి ఏపీ మోడల్ స్కూల్ వద్దనున్న బాలికల హాస్టల్‌ను ఎంపీడీఓ శకుంతల మంగళవారం తనిఖీ చేశారు.రికార్డులను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలని వార్డెన్‌ను ఆదేశించారు.